# మంజీరా

# ఆత్మగత

చేతిలో చిన్నసైజు లగేజీతో అతను "ఉమెన్స్ హాస్టల్" గేటుముందు నిలబడ్డాడు. నిరీక్షణలో కేవలం విసుగుతప్ప మరేం ఉండదనుకున్నాడు ఇంతవరకూ. ఈ కొద్దిక్షణాల్లోనే తెలిసింది. అందులోని తియ్యదనం ఏమిటో! అతని హృదయస్పందన అతనికే చిత్రంగా తోచిందిరోజు. మనసులో పెల్లుబికిన ఉల్లాసాన్ని అదుపు చేయలేకపోతున్నాడు ఎందుకో!? ఓ అపరిచిత వ్యక్తిని ... అందునా వయసుకొచ్చిన ఓ ఆడపిల్లను విచిత్రపరిస్థితుల్లో ఇలా నేరుగా కలుసుకోవడం చిత్రంకాక మరేమిటి?!

ఆమె ఎవరో తనకు తెలుసు కాని ఆమె ఫలానా అని ఖచ్చితంగా తను గుర్తుపట్టలేడు. ఆమె ఎదురుగా నిలబడి తన గురించి వివరించినా తనను గుర్తుపట్టలేని విచిత్ర పరిస్థితి. అయినా ఒకరికొకరు పరిచయమున్నట్లు నటించడం— కలుపుగోలుగా మాట్లాడుకోవడం నిజంగా గొప్ప థ్రిల్లింగ్ అనిపించిందతనికి.

"ఎవరు కావాలి మీకు?" నిజంగా తనకోసమే వచ్చాడా అన్న అనుమానంతో అడిగిందామె. దీపపు కాంతి ఆమె అందగత్తె అన్న విషయాన్ని ఋజువుపరిచింది. ఒకవేళ అతను తనకోసమే వచ్చిఉంటే ఎవరై ఉంటాడని నిశితంగా పరిశీలించాయి ఆమె లేడికళ్ళు!

ఆమె అదే ప్రశ్న రెట్టించడంతో అతను త్రుళ్లిపడ్డాడు. తన పరధ్యానకు రవ్వంత సిగ్గుపడ్డాడు కూడా.

"మీరు... శైలజ కదూ?"

"ఔను... నేనే... శైలజ... డాటరాఫ్ గోపాలావ్... ఎమ్మెస్సీ... ఫైనలియర్...! ...., చాలా ఇంకా ఏవైనా వివరాలు కావాలా అన్నట్లు చూసింది.

"సారీ ... మీకు కోపం వచ్చినట్లుంది. నేనడిగింది... మీరు మీరేనా... అని తేల్చుకోడానికి" ఆమె అలా నాటకఫక్కీలో మాట్లాడడం అతనికి రవ్వంత బాధ కలిగించిది.

"ఛ... ఛ!.. అందుకని కాదండీ! అసలు మీరెవరికోసం వచ్చారోనని... మా హాస్టల్లో నాపేరుగల వాళ్ళు చాలామంది ఉన్నారని అలా అన్నాను...".

అతని మనసూరట పడిందిప్పుడు.

"మీ నాన్నగారు... ఇవి మీకు అందజేయమన్నారు... మీ నాన్నగారు నాకెలాపరిచయం? అని అనుకుంటున్నారా... మానాన్నగారూ — మీనాన్నగారూ చిన్ననాటి స్నేహితులు. ఈ మధ్యే తెలిసింది మీ నాన్నగారు కూడా విజయవాడలోనే ఉంటున్నారన్న సంగతి. మాటల్లో నేను విశాఖపట్నంలో ఉద్యోగం చేస్తున్నట్టు చెప్పాను... మీరు ఇక్కడ హాస్టల్లో ఉండి చదువుకుంటున్నట్లు చెప్పి ఇవి మీకు అందజేయమన్నారు..." ఇదండి బాబూ అసలు సంగతని శ్వాస పీల్చుకున్నాడతను.

"సారీ... మీకు శ్రమకలిగించాను..." అతని చేతిలో లగేజి అందుకుంటూ అంది.

"కానీ అంతాచెప్పి అసలు సంగతి చెప్పలేదు మీరు..." ఇంకా సందిగ్ధంలోనే ఉంది ఆమె పరిస్థితి.

"అసలు సంగతేమిటండి?" క్వశ్చన్ మార్కులా చూశాడు.

"ఇంతకూ మీ నాన్నగారెవరో చెప్పలేదు..." మీ పేరేమిటని అడగబోయి అలా అడిగిందామె తెలివిగా!

"చంపేశారు... అది చెప్పనే లేదుకదూ!... సారీ ... మానాన్నగారిపేరు... వరప్రసాదరావుగారు ... మీ ఇంటికి తరచూ వస్తూండేవారు... మీరు చూసే ఉంటారు...".

"ఐతే ...మీపేరు ... ప్రకాష్ కదూ!..." ఏదో గుర్తుకొచ్చినట్లు అడిగింది.

"థాంక్యూ... నన్ను గుర్తుపట్టలేరేమో అనుకున్నాను..."

"మీకే థాంక్స్‌చెప్పాలి... నా గురించి ఇంత శ్రమపడి వచ్చినందుకు..."

"ఇందులో శ్రమేముందండీ?..." ఇది నా బాధ్యత అనబోయి సగంలోనే ఆగిపోయాడు ఆపైన ఎలాపొడిగించాలో తెలీక.

అప్పటికే సాయంత్రపు వెలుగులు మాయమై చీకటి తెరలు కమ్ముకురావడంతో అతన్నలా అంత సేపు గేటు ముందు నిలబెట్టి మాట్లాడ్డం సభ్యతనిపించుకోదు. అందుకని అతన్ని నేరుగా లోపలకు తీసుకువెళ్లాలేదు... లోపల ఉండేదంతా ఆడపిల్లలే కాబట్టి! అందుకే ఓ నిర్ణయానికొచ్చి ఇలా అంది "ప్రకాష్ మీరు మరోలా ఫీల్ అవనంటే..." వాక్యాన్ని పూర్తిచేయకుండా అతనివైపు చూసింది.

"చెప్పండి!"

"మిమ్మల్నిలా రోడ్డుమీద నిలబెట్టి మాట్లాడేయడం అంత బాగోలేదు... మీకు వీలుగా ఉంటే రేపు ఆదివారం 'రామకృష్ణా' బీచ్‌కు రండి... సావకాశంగా మాట్లాడుకోవచ్చు..." అతని అంగీకారం కోసం చూసింది.

ఆ క్షణం ఆమె వరమిచ్చినదేవతలా కనిపించిందతనికి. ఈ సదవకాశాన్ని జారవిడిచేంత వెర్రివాడా తను? సంతోషంగా ఒప్పుకొని "మీకోసం ఎక్కడ వెయిట్ చేయమంటారు?..." అనడిగాడు ఉత్సుకతతో!

"నేనే... మీకోసం ఆదివారం సాయంత్రం ఐదుగంటలకు పార్క్‌లో వెయిట్‌చేస్తుంటాను తప్పకుండా రావాలి!" తప్పకుండా రావాలిసుమా అన్నట్లు హెచ్చరించింది.

"ష్యూర్... తప్పకుండా వస్తాను...బై..." గాలిలో చేయూపుతూ అన్నాడు... వెళ్లలేక వెళ్లలేక వెళ్తూ!

ఆమెకూడా ఎంతో పరిచయం ఉన్న వ్యక్తికి వీడ్కోలు చెప్తున్నట్లు తనకూ చెప్పడం, మరీ థ్రిల్లింగనిపించింది.

* * *

ఆదివారం మూలాన ఎప్పుడూకంటే మరీ రద్దీగా ఉంది రామకృష్ణాబీచ్!

వయసుతేడా తెలీకుండా చిన్నపిల్లల్లా ఆడుకుంటున్నారు అంతా... సముద్రపు ఒడ్డున... కదలి వస్తూన్న కెరటాలతో!

"అతడు—ఆమె కలుసుకోవడం ఓ మధురకావ్యానికి నాంది" అన్నట్లు ఆమెకు ఎదురుగా మరింత దగ్గరగా టేబిల్‌ముందు అలా ఆమె సోగకళ్లలోని మూగభాషను వెదికి అర్థంచేసుకో ప్రయత్నించడం — నేరుగా ఆమె కళ్లల్లోకి చూడలేక దొంగచూపులు చూడడం... చివరికి ఎక్కడో పట్టుబడిపోవడం... అంతా మరచిపోలేని ఒక మధురానుభవంలా ఉందతనికి!

ఏదో గుర్తుకొచ్చినవాడిలా ఎదురుగా ఉన్న కాఫీని రెండు గుక్కల్లో త్రాగడం పూర్తిచేశాడు.

బేరర్ ఇచ్చిన బిల్లును తను 'పే'చేస్తానంటే ఆమె అందుకొప్పుకోక తనే 'పే'చేసింది అతను ఇవాళ తన చీఫ్‌గెస్టట!

నెమ్మదిగా మెట్లు దిగి ఇసుకతిన్నెలమీదికొచ్చారు. సముద్రపు హోరుగాలి చెవులను తాకకుండా చెవులమీంచి కప్పుకుంది చీరకొంగు. ఆమె అందం మరింత ద్విగుణీకృతమయింది. రెప్పార్పకుండా చూశాడోక్షణం!

ఎత్తయిన ఇసుకదిబ్బపై ఒయ్యారంగా కూర్చుందామె. ఆమెకు అతి దగ్గరలోనే అతనూ చతికిలబడ్డాడు. ఆమెకెందుకో సిగ్గనిపించింది. అతనలా అధికారికంగా తనకు చేరువలో కూర్చోడం ఒకరకంగా సంతృప్తిని కూడా కలుగచేసింది. అతని నిండైన విగ్రహం — సత్ప్రవర్తనా ఆమెను ఆకట్టుకున్నాయి.

సరిగ్గా అక్కడే నాటుకుంది ప్రేమ బీజం. ఒకరోజు పరిచయం.. వారాలు నెలలదాకా తీసుకుపోయి ప్రేమసాగరంలో ముంచేసిందిద్దరినీ!

"శైలూ... ఇంతకూ నేనంటే ఇష్టమా కాదా?"

అప్పటికే సాయంత్రపు వెలుగులు మాయమై చీకటి తెరలు క్రమ్ముకురావడంతో అతన్నలా అంత సేపు గేటు ముందు నిలబెట్టి మాట్లాడ్డం సభ్యతనిపించుకోదు. అందుకని అతన్ని నేరుగా లోపలకు తీసుకు వెళ్లాలేదు...

చల్లకొచ్చి ముంత దాచడం దేనికన్నట్లు చూస్తూ అడిగాడు.

ఆమె వస్తూన్న నవ్వును ఆపుకుంటూ అంది "బావుంది... ఇష్టంలేకుండా ఏ ఆడపిల్లా ఒక అబ్బాయి వెంట ఇలా తిరగదు!..."

ఏ ఆడపిల్లా మొహంమీద "ఐలవ్‌యు" అని అనలేదని అతనికి మాత్రం తెలియదనా? తెలుసు ... ఐనా పట్టుదల ఆమెనుండి నేరుగా ఆ అభిప్రాయం రాబట్టాలని.

ఆ పట్టుదలే ఆమెకు చికాకుకూడా కలిగించేది. అసలీ మనిషికి తనపైన నిజంగా మక్కువ వుందా లేక పైపై ఆకర్షణేనా అన్న అనుమానంకూడా ఆమెకు కలుగక మానలేదు. అందుకే ఉండబట్టలేక సూటిగా అడిగింది.

"నాసంగతలా ఉంచి... ముందు మీ గురించి ఆలోచించండి... మీరు నన్ను నిజంగా ప్రేమిస్తున్నారనుకోవాలా... లేక ఇది కేవలం. వయసు తెచ్చిన ఆకర్షణా?..."

"ఇది వట్టి వయసు తెచ్చిన ఆకర్షణే అయితే... ఇంతకాలం నిరీక్షణ దేనికి..." ఎదురు ప్రశ్నవేశాడు. అతని కళ్లల్లో రోషం గూడుకట్టుకుంది.

'ఎందుకు కాకూడదూ?' అన్న అనుమానం ఆమెను ఎప్పట్నుంచో పీడిస్తూనే ఉంది. ఇంతవరకూ తను ఎటూ తేల్చుకోలేకపోయింది. ఇప్పుడా అవకాశం ఎలాగో వచ్చింది కాబట్టి జారవిడుచుకోదల్చలేదామె. చివరికో నిశ్చయానికొచ్చింది.

"పెళ్లంటే నూరేళ్లపంట అంటారు పెద్దలు... బతికింతకాలం జీవితం ఏ ఒడుదుడుకులూ లేకుండా సాఫీగా సాగాలి... అలా సాఫీగా సాగాలంటే మధ్యలో ఎలాంటి భేదాభిప్రాయాలు తలెత్తకూడదు... అందుకే మీకు తెలియని నిజం ఒకటి మీ ముందుంచుతున్నాను" సగంలోనే ఆపి నిజంగా అతనికి ఆసక్తి ఉందా అన్నట్లు పరీక్షగా చూసిందతనివైపు.

ఆశ్చర్యంతో కనుబొమలు ముడిపడ్డాయి. వినకూడని విషయమేదో వినబోతున్నట్లు టెన్షన్ ఎక్కువయిందతనిలో!

ఆమె తిరిగి చెప్పడం ప్రారంభించింది.

"మీకీపాటికి తెలిసే ఉండాలి... మాది చాలా పెద్ద





కుటుంబం!... మా నాన్నగారికి మొత్తం ఏడుగురం ఆడపిల్లలం. చివరగా ఓ తమ్ముడున్నాడు. వాడికోసం ఇంతమంది ఆడపిల్లల్ని ఓపిగ్గా కన్నారు మా అమ్మా—నాన్నా! కనటం కన్నారు కానీ కన్నంత తేలికగా మా పెళ్లిళ్లు చేయలేకపోయారు... దానికితోడు... క్రొత్త ప్రభుత్వం పుణ్యమా అని మా నాన్నగారు అర్థాంతరంగా రిటైరవడం ఒకటి! మా మేనత్త కొడుకుతో ఎలాగోలాగ మా పెద్దక్క పెళ్లయిందనిపించారేకాని మిగిలిన మా పెళ్లిళ్లు చేయలేకపోయారు. అందుకే ఏం తోచక కాలక్షేపానికి ఇలా చదువుల పాలయాం... స్కాలర్‌షిప్‌ల సాయంతో..." కాస్తఆగి ఊపిరి పీల్చుకుని చివరికిలా అంది. "పైసా ఖర్చులేకుండా మా పెళ్లిళ్లు చేయాలనే ఉద్దేశ్యంతో మనిద్దరినీ ఇలా ఒంటరిగా కలిసేలా చేసి — మా నాన్నగారు వేసిన 'ఎత్తుగడ' ఇదంతా అని అసలు మీరూహించగలిగారా?!!" అర్థయుక్తంగా చూస్తూ అడిగిందామె.

ఏమని జవాబు చెప్పాలో దిక్కుతోచని అతను... ఆపైన నోరు విప్పితే ఒట్టు!!

*